క్లుప్తంగా

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



అక్షరను అభినందిస్తున్న జగదీష్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్ : ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రానికి చెందిన యాతాకుల అక్షర ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అక్షరను సన్మానించారు. భవిష్యత్తులో డాక్టర్‌గా సమాజానికి, పేదలకు సేవ చేయాలని అన్నారు. మల్లారెడ్డి వైద్య కళాశాలలో (సీఎంఆర్ఎం) ఎంబీబీఎస్ సీటు సాధించిన అక్షరను గ్రామస్తులు అభినందించారు.

జాజిరెడ్డిగూడెంలో గ్రామోత్సవం



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు ఇంటింటికీ టెంకాయలు కొట్టి హారతులిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అర్చకులు పాల్గొన్నారు.

వెండి కిరీటం అందజేత

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని సీతారాంపురం కాలనీలోని శ్రీ వైకుంఠ రామాలయంలో గ్రామానికి చెందిన అల్లెపు సూర్యనారాయణ–స్రవంతి దంపతులు శుక్రవారం సీతమ్మ తల్లి విగ్రహానికి వెండి కిరీటం అందజేశారు. ఈ సందర్భంగా పురోహితులు ఇరువంటి మురళీకృష్ణ శర్మ, విజయకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉద్యోగుల సన్మాన సభ



ఉద్యోగులను సన్మానిస్తున్న యాదవులు

నూతనకల్ : మండల పరిధిలోని తాళ్లసింగారంలో శుక్రవారం యాదవ ఉద్యోగుల ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 17మంది యాదవ ఉద్యోగులను తాళ్లసింగారం యాదవులందరూ కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

మునగాల : మునగాల మండలంలోని కలకోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996– 2007 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ మిత్రుడి కుటుంబానికి చేయూతనందించారు. తమ మిత్రుడు ఇటీవల మృతి చెందడంతో పనస రమేష్, పనస విజయలక్ష్మి ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల నగదు సేకరించి మృతుడి పిల్లల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. శుక్రవారం మృతుడి భార్య గంగాభవానికి డిపాజిట్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పనస విజయ్‌కుమార్, దొడ్డారపు సతీష్, కేత వసంతరావు, పేర్ల వీరబాబు, బాలగంగాధర్, బుర్రి వినోద్, రాచకొండ నగేష్, మండల ఏసుబాబు, షేక్ షబ్బీర్, బుర్రి స్వాతి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మలుపులు.. మృత్యు పిలుపులు



చివ్వెంల – పాండ్యానాయక్ తండా రహదారిలో ఉన్న మూలమలుపు



చివ్వెంల నుంచి వాల్యతండాకు వెళ్లే రహదారిలో..

- పలు గ్రామాల రహదారుల్లో ప్రమాదకరంగా మూలమలుపులు
- రోడ్లను కమ్ముకుంటున్న ముళ్లపొదలు
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

చివ్వెంల : మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు మూలమలుపులతో ప్రమాదకరంగా మారాయి. కనీసం సూచిక బోర్డులు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని వాల్యతండా – వట్టిఖమ్మంపహాడ్, మున్యానాయక్‌తండా – బీబీగూడెం, తిమ్మాపురం – బి.చందుపట్ల, మోదిన్‌పురం – ఖాసీంపేట, లక్ష్మణ్ నాయక్‌తండా – పులితండా, బి.చందుపట్ల – భీమ్లాతండా, మొగ్గయ్యగూడెం – చందుపట్ల, పిల్లలజెగ్గుతండా – జయరాం గుడితండా, పాశ్యాతండా పొలిమేర – సూర్యాతండా గ్రామాల రహదారుల్లో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి.

మలుపులకు తోడు ముళ్లకంప..

ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులకు తోడు రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదలతో రోడ్లు కనిపించడం లేదు. గ్రామాల్లో సింగిల్ రోడ్డు ఉండటం వల్ల వాహనాలు ఎదరెదురుగా వచ్చినప్పుడు అదుపుకాక కిందకు దూసుకెళ్తూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూలమలుపుల వద్ద పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాలు కోరుతున్నారు.

మూలమలుపులు సరిచేయాలి

మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మూలమలుపుల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల్లో మలుపులను సరిచేసి, అవసరమైన చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– చెరుకుపల్లి కిరణ్ కుమార్, వట్టిఖమ్మంపహాడ్

వాసవీ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న మీలా మహదేవ్

సూర్యాపేట : ఆర్యవైశ్యులందరికీ అందుబాటులో ఉండేలా వాసవీ భవన్ నిర్మాణం చేపట్టాలని సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీ చైర్మన్ మీలా మహదేవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో వాసవీ భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వాసవీ భవన్ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వాసవీ భవన్ ట్రస్ట్ అధ్యక్షుడు తోట శ్యాంప్రసాద్ మాట్లాడారు. వాసవీ భవన్ సూర్యాపేట పట్టణంలో సేవా కార్యక్రమాలకు ఒక వేదిక కానుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్య సంఘం అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, వాసవీ భవన్ సెక్రటరీ బిక్కుమల్ల కృష్ణ, ట్రెజరర్ మిర్యాల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి యూత్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ ఎన్నికలో పాల్గొన్న గీతాంజలి యూత్ సభ్యులు

నాగారం : నాగారం గ్రామంలో గత 25 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గీతాంజలి యూత్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గీతాంజలి యూత్ గౌరవ అధ్యక్షుడిగా కత్తుల వెంకన్న, నూతన కమిటీ అధ్యక్షుడిగా కన్నెబోయిన లింగమల్లు, ఉపాధ్యక్షులుగా కన్నెబోయిన బుచ్చిబాబు, వేల్పుల మహేష్, ప్రధాన కార్యదర్శిగా బకతట్ల కొమరెల్లిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు రామకృష్ణ, సుదర్శన్, వంగూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యులు

చివ్వెంల : సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, సీనియర్ న్యాయవాదులు జే.శశిధర్, వేణుగోపాల్, నాతి సవీందర్‌కుమార్, నల్లకుంట్ల అయోధ్య, మోదుగు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అర్వపల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ 2008–2009 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 16 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురువులు పద్మజ, ప్రభాకర్‌రెడ్డి, సురేంద్ర, కుర్ర శ్రీనివాస్, దావుల మల్లిఖార్జున్, సంతోష, పూర్వవిద్యార్థులు శంకర్, జనార్దన్, ప్రసాద్, నరేష్, రాంబాబు, సురేష్, శేఖర్, సురేష్, మధు, బాలకృష్ణ, జ్యోతి, స్వప్న, అశోక్, శ్రీను, మానస, శైలేందర్, నాగయ్య, వెంకన్న, నరేష్, రమేష్, కల్యాణి పాల్గొన్నారు.

దుర్గామాత నిమజ్జనం, శోభాయాత్రలు



కుక్కడంలో దుర్గామాతను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

మద్దిరాల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో శుక్రవారం దుర్గామాత నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుర్గామాత విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో భవాని స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని తిమ్మాపురం, అక్కలదేవిగూడెం, బి.చందుపట్ల, కుడకుడ, వట్టిఖమ్మంపహాడ్, వల్లభాపురం గ్రామాల్లో గురువారం దుర్గామాత నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సైదాచారి, సైదులు, కోటేశ్వరి, మల్లేశ్వరి, శృతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి నివాళి



తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అర్వపల్లిలో ఆర్డీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి దామోదర్ రెడ్డి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, మార్కెట్ డైరెక్టర్లు రాపాక సోమేష్, ఎండీ అఫీజ్, బర్ల వెంకటేశ్వర్లు, చేను శ్రీనివాస్, కృష్ణమాచారి, చాగంటి రాములు, ఎల్సోజు నవీన్, సతీష్, నర్సింహ పాల్గొన్నారు.

అర్వపల్లి : మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, పర్సాయపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ నాయకులు, అభిమానులు ఉన్నారు.

నూతనకల్ : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఎస్సారెస్పీ జలాల ప్రదాత దామోదర్‌రెడ్డి మృతి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డుపల్లి అంజయ్య పాల్గొన్నారు.

నాగారం : మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి మండల పరిధిలోని శాంతినగర్, పస్తాల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుంగతుర్తి, సూర్యాపేట రెండు నియోజకవర్గాల ప్రజలు ఒక పెద్దదిక్కుని కోల్పోయారని అన్నారు. దామోదర్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్కే యాకూబ్ వలీ, పొదిల లింగయ్య, సైదులు, షేక్.జాన్, కమాల్, మల్లేపాక మైసయ్య, శేఖర్, యాదయ్య, షేక్ బడే సాబ్, షేక్ ఫరీద్, అక్బర్ పాష, వడ్లకొండ అంజయ్య, బుక్క శ్రీను, అక్బర్, జాన్ పాల్గొన్నారు.



ఆత్మకూర్ (ఎస్) : దాచారంలో..

ఆత్మకూర్ (ఎస్) : మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతి చెందడంతో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆత్మకూరు మండలానికి దామోదర్ రెడ్డికి విడదీయరాని బంధం ఉంది. మండలంలోని మిడ్తనపల్లి, కోటపహాడ్, పాతర్లపహాడ్, ముక్కుడుదేవులపల్లి, గట్టికల్ తదితర గ్రామాలను ఆయన దత్తత తీసుకొని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దామోదర్ రెడ్డికి రాజకీయ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా అభిమానులు ఉన్నారు. దామోదర్ రెడ్డి మరణం పట్ల మండలంలోని గ్రామాల ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో దామోదర్ రెడ్డి చిత్రపటాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి గత రెండు రోజులుగా సంతాప కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలువురు అభిమానులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు, దామోదర్ రెడ్డి నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



నాగారం : శాంతినగర్‌లో..

పెన్‌పహాడ్ : సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి తీరని లోటని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సారెస్పీ జలాల ప్రదాత దామోదర్‌రెడ్డి అని కొనియాడారు.

మద్దిరాల : రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వేగంటి సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం కుక్కడంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నాగారం : పస్తాలలో..



అర్వపల్లి : పర్సాయపల్లిలో..



నూతనకల్‌లో..

మాయమాటలు చెప్పేటోళ్లను నమ్మొద్దు

అనంతగిరి : స్థానిక సంస్థల ఎన్నికల్లో మాయమాటలు చెప్పేటోళ్లను నమ్మి ఓట్లు వెయ్యొద్దని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఓట్లు వేసి మోసపోయిన ప్రజలను చైతన్యం చేయాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర ప్రజల బతుకులు మార్చేందుకు కేసీఆర్ 14 సంవత్సరాలు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిపుచ్చుకున్నామని అన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. ప్రతిఒక్కరూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నల్లా భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుగులోతు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మట్టపల్లి పుల్లయ్య గౌడ్, పి.వీరయ్య, ఐతనబోయిన వెంకటేశ్వర్లు, మట్టపల్లి సైదులు, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

నడిగూడెం : గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం నడిగూడెంలోని శ్రీ కొల్లు పాపయ్య చౌదరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు శుక్రవారం ఆయన నగదు బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని, ఐక్యతకు దోహదపడతాయన్నారు. కాగా, పోటీల్లో ప్రథమ బహుమతిని నడిగూడెం మండలం ఎకలాస్‌ఖాన్‌పేట తండా, ద్వితీయ బహుమతి లిటిల్ స్టార్ యూత్, తృతీయ బహుమతి గరిడేపల్లి మండలం పొనుగోడుకు చెందిన జోగు పిచ్చిరెడ్డి మెమోరియల్ జట్లు గెలుచుకున్నాయి.

పంటల లెక్క పక్కాగా ఉండేలా..

- వివరాల సేకరణలో అధికారులు బిజీ
- క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రత్యేక యాప్‌లో నమోదు



దోసపహాడ్‌లో పంటల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)

పెన్‌పహాడ్ : వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నమోదు చేసేందుకు ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టారు. డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా రైతుల నుంచి వివరాల సేకరణలో ఏఈఓలు గ్రామాల బాటపట్టారు. వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

29 పంచాయతీల్లో సర్వే..

మండల వ్యాప్తంగా 29 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 5 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కొక్క క్లస్టర్‌కు ఐదు నుంచి ఆరు గ్రామాలు ఉండగా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పంటల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మొదటగా గ్రామాల వారీగా పంటల సాగు విస్తీర్ణం వివరాలను సేకరించి ఆ తర్వాత ట్యాబ్‌లో నమోదు చేసేవారు. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలు, సాగు విస్తీర్ణాన్ని పరిశీలించి యాప్‌లో నమోదు చేస్తున్నారు.

పక్కాగా పంటల వివరాలు..

డిజిటల్ సర్వేలో భాగంగా క్లస్టర్ వారీగా ఏఈఓలకు సూచించిన గ్రామాల్లో రైతు పేరు, సర్వే నంబర్, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నంబర్‌తో పాటు ఏఏ పంటలు సాగు చేశారనే వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ విధానంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా వివరాలు పక్కాగా ఉండేలా సర్వే నిర్వహిస్తున్నారు. పెన్‌పహాడ్ మండల వ్యాప్తంగా వరి 32వేల ఎకరాలు, పత్తి 1400 ఎకరాలు, కంది 50 ఎకరాలు, పెసర 40 ఎకరాల్లో పంటలను సాగు చేశారు. ఇప్పటి వరకు అధికారులు 26వేల ఎకరాల్లోని పంటల వివరాలను నమోదు చేశారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి..



రైతులు సాగు చేసిన పంటల వివరాలను పొలాలకు వెళ్లి పరిశీలించిన తర్వాత ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నాం. వివరాల నమోదుతో రైతులు పంటలను విక్రయించడంలో ఇబ్బందులు ఉండవు. అలాగే పంటలు దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం నష్టపరిహారం అందించడానికి ఉపయోగకరంగా ఉంటుంది.

– మురళి, ఏఈఓ, అనాజీపురం క్లస్టర్

నమోదు చేయించుకోవాలి



రైతులందరూ పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. మూడేళ్లు వరుసగా పంటల వివరాలు నమోదు చేసుకోకపోతే రైతు భరోసా అందదు. ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను డిజిటల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

– అనిల్‌కుమార్, వ్యవసాయ అధికారి

వైభవంగా విజయదశమి వేడుకలు



తుంగతుర్తిలో జమ్మిపూజలో పాల్గొన్న గ్రామస్తులు



తిరుమలగిరిలో..



నాగారంలో వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు



నూతనకల్ : ఎర్రపహాడ్‌లో..



అర్వపల్లి : కోడూరులో..